# ఓ సూర్యుడి కథ

ముందు జరిగిన కథ చెప్తాను.

చెరువు గట్టున మర్రిచెట్టు, దాని వెంబడేవున్న శివాలయం, శివాలయం ముందు ఇసుకదిబ్బ — వీటన్నిటినీ ప్రేమిస్తూ, వాటన్నిటి మధ్యా ఆటలాడుకొనే వయస్సులోనే — శంకరం నెత్తిన పిడుగు పడిందో రోజు.

'చదివింది చాలుగానీ కొంపలో కూర్చుని బొమ్మలు చెయ్యడం నేర్చుకో. ఈ ఏడాది బళ్లో చేరక్కర్లేదురా' అన్నాడు వాళ్లయ్య-రంగనాథం.

అప్పటికి శంకరం ఎనిమిది పూర్తి చేశాడు.

కళ్లల్లో నీళ్ళెట్టుకుని అమ్మవైపు చూస్తే — నీరెత్తిన నిమ్మ చెట్టులా వుందామె. అప్పుడు శంకరం వయస్సు పధ్నాలుగు.

చినుకులు రాలే కాలం వచ్చింది. కళ్లవెంట సన్నని తుంపరులు రాలుస్తూ కొయ్యబొమ్మలు చెక్కటం నేర్చుకోవటానికి కూర్చునేవాడు శంకరం.

బొమ్మలతయారీ — ఆవూరి కుటీరపరిశ్రమ; ఇంటింటికీ చేతిపని.

అమ్మా అయ్యా, ఆరుగురు పిల్లలూ — కడుపులో కాళ్ళెట్టి కాలాన్ని తోసుకొచ్చేవాళ్లు.

ఎదురింటి మేడని పలకరించి పోతుండే వెన్నెల శంకరం వాళ్ల

నిట్టాడినీ తాకేది అప్పుడప్పుడూ. అప్పుడు రంగనాథం గారింట్లో అందరికీ నాలుగు వేళ్ళూ నోట్లోకి వెళ్ళేవి; పట్టాభి గారు ధర్మాత్ముడు అనుకునేవాళ్ళు! శంకరం మాత్రం గోపీ చాలా మంచివాడు అనుకునే వాడు. గోపీనాథ్ పట్టాభిగారి అబ్బాయి.

పుస్తకాల దొంతరతో స్కూలుకి వెళ్తూ వుండే గోపీని చూస్తుంటే - శంకరయ్య కళ్ళల్లో ఋతువులు కనిపిస్తూ, ఫలిస్తూ వుండేవి.

ఓరోజు — గోపీతో తన గోడు చెప్పుకున్నాడు శంకరం. పొయ్యిలో పిల్లిలేవని పూటలు లెక్కెస్తుంటే — జాలిగా శంకరం కేసి చూశాడు గోపీ.

అమర్నాడు,

శంకరాన్ని తనతో రమ్మన్నారు పట్టాభి.

శంకరం ఆయన వెంట వెళ్ళాడు - భాష వెంట వెళ్ళే భావంలా; ధర్మాన్ని అనుసరించే నీతిలా, విశ్వామిత్రుడి వెనుక రామునిలా!

"వీరి పేరు సీతారామయ్యగారు. వీరు చెప్పిన పనల్లా చెయ్యటమే నీ పని. ప్రతి ఒకటో తారీఖునా నల్భై రూపాయిలిస్తారు. తెచ్చి మీ నాన్న కివ్వు" అన్నారు పట్టాభి.

శంకరం ఉద్యోగస్తుడైనాడు,

రంగనాథం, శంకరం తల్లీ-కళ్ళల్లో పారిజాతాలు పండించుకున్నారు.

సీతారామయ్య చెప్పినవన్నీ చెయ్యటం నేర్చుకున్నాడు శంకరం.

అవును శంకరం సిక్కింలాంటి వాడు!

సీతారామయ్యగారు - ఇంటికి కూరలు తెమ్మనేవారు; వాళ్ళకుక్కపిల్లని స్నానం చేయించమనేవారు, దానికి మందూ మాకూ వేయించుకు

రమ్మనే వారు; ఆయన మనవడిని ఎత్తుకు తిప్పమనే వారు: వాళ్ళావిడకూ, అమ్మాయికీ వేణ్ణీళ్ళు తోడమనే వారు; ఆయన కాంప్‌లకి వెళ్ళే ముందు ముందుగా స్టేషనుకి వెళ్ళి టిక్కెట్ కొని ప్లాట్ ఫారమ్ మీద సిద్ధంగా వుండమనే వారు; బస్‌లో సీటు కాసి ఆయన వచ్చేదాకా ఆ సీట్లో కూర్చోమనేవారు; ఆయన పై అధికార్లొచ్చినప్పుడు 'టీబీ' కి వెళ్ళి వాళ్ళకేం కావాలో చూడమనేవారు; లాండ్రీకివెళ్ళి గుడ్డలు తెమ్మనే వారు; వాళ్ళంతా సిన్మా కెళ్ళాల్సినప్పుడు ముందుగా టిక్కెట్లు రిజర్వ్ చేయించుకు రమ్మనేవాళ్ళు; వాళ్ళ అల్లుడుగారు ఆయనింటికి వచ్చినప్పుడు - రాత్రిళ్ళు - మనవణ్ణి తనదగ్గర పడుకోబెట్టుకుని అక్కడే వుండిపొమ్మనే వాళ్ళు.

వీటన్నిటికీ - అప్పుడప్పుడూ - కోపంతో అటూఇటూ సాగినా - వాన పాములాంటి శంకరం - ఆ చోట్లోనే ఎడ్జస్టయి పోయాడు, రెండేళ్ళు. ఈ లోగా —

తన నెల జీతం గవర్నమెంట్‌లో పిడబ్ల్యుడి శాఖకు ఖర్చు రాయబడుతున్న సంగతి తెలిసింది శంకరంకి.

ఓ రోజు,

సీతారామయ్యగారమ్మాయి - శోభనం పెళ్ళికొడుకు లాంటి తన మొగుడికి అమర్చాల్సిన జరుగుబాట్లలో ఎక్కడో ఓ లోపాన్ని 'పాయింటవుట్' చేసి శంకరాన్ని 'సిగ్గులేని వెధవా' అనేసింది.

సిక్కింలో అంతర్యుద్ధంలాంటిది చెలరేగింది.

వానపాముకి ఎలాగైనా సరే ఆమట్టిముద్దని కుళ్ళగించి అవతలి వైపుకి సాగిపోవాలనిపించింది.

శంకరం ఉద్యోగాన్ని వదిలేశాడు.

ఎనిమిది నెలలపాటు రంగనాథం ఇంటికి గ్రహణం పట్టింది! అప్పుడది డెవిల్స్ వర్క్‌షాప్!!

* * *

పదేళ్ల తర్వాత —

ఇప్పుడు జరుగుతున్న కథ చెప్తాను.

శంకరం నిద్రలేచాడంటే - తెల్లవారు ఝామున నాలుగున్నరైనట్టు. తన కాల కృత్యాలు తీర్చుకుని తండ్రిని లేపుతాడు. రంగనాథం మిగిలిన పిల్లల్ని లేపుతాడు. పిల్లలంతా ఎవరి పనుల్లో వాళ్ళు పడిపోతారు —

ఈలోగా శంకరం తల్లీ లేస్తుంది, శంకరం భార్య లక్ష్మీ లేస్తుంది.

శంకరం సైకిల్ తీసుకుని ఊళ్ళోకి వెళ్తాడు.

శంకరం తల్లి వంటింట్లో పని మొదలెట్టుంది.

శంకరం తండ్రి ఆరింటికల్లా వసారా అరుగుమీదికి చేర్తాడు. ఆయన ముందు బొమ్మల కొలువు. బొమ్మల తయారీ నేర్చుకునే కుర్రకారు.

శంకరం తమ్ముళ్ళిద్దరూ - తల్లి యిచ్చే యిడ్లీలనీ, వదిన సమకూర్చే చట్నీని పుచ్చుకుని చెరో వీధికీ వెళ్తారు.

తొమ్మిది గంటలయ్యేసరికీ తిరిగొస్తాడు శంకరం. ఈలోగా అతని దినపత్రికల పంపిణీ అయిపోతుంది. ఇంట్లో నాలుగు ఇడ్లీలు దట్టించి మళ్ళీ సైకిలెక్కుతాడు. పన్నెండు గంటలకి మళ్ళీ ఇంట్లో హాజరు. ఈ మధ్య కాలంలో అతను మరో కంపెనీ డిస్ట్రిబ్యూటరు. ఆ కంపెనీ తయారు చేసే చక్కని వక్కపొడిని శంకరం మార్కెట్ చేస్తున్నాడు. తాను యింటికి వచ్చేసరికీ ఉదయపు కొలువు అయి

పోతుంది. భోజనాలు ముగించి చిన్నా పెద్దా అందరూ నడిమిటింట్లో చేరతారు. శంకరం తమ్ముళ్లూ, చెల్లాయిలూ — వీరందరి చేతులూ యంత్రాల్లా సాగిపోతూవుంటై: పందల లెఖ్ఖలో సిలిఫోన్ పేపర్ కవర్లు, వివిధ సైజుల్లో తయారౌతూవుంటై.

శంకరం తండ్రి బొమ్మలు చెక్కుతూ వుంటాడు. తల్లీ, భార్యా ప్లాస్టిక్ బుట్టల అల్లకంలోనో లేదా అప్పడాలు వత్తడంలోనో నిమగ్నమౌతారు.

నాలుగింటికి మళ్లీ శంకరం రథం కదుల్తుంది. కవర్లు ఇతర పదార్థాలూ షాపులకి పంపిణీచేసి సాయంత్రం ఆరుగంటలయ్యే సరికి — సమతా ప్రింటర్స్‌కి చేరుకుంటాడు శంకరం. రాత్రి పదింటిదాకా అత నక్కడ కంట్రాక్టు పద్ధతిన కంపోజిటర్ అవతారంలో వుంటాడు.

శంకరం తల్లీ భార్యా — తరచుగా చీరెల వ్యాపారమూచేస్తారు. ఏ గుంటూరు నేత చీరెలో, పెడన చీరెలో, బందరు కలంకారీ డోర్ కర్టెన్సో, లేపాక్షీ ప్రింటెడ్ చీరెలో తమ యింటి చుట్టుపక్కల వాళ్లకి సరఫరా చేస్తూవుంటారు. నెలకో పాతిక ముప్ఫై చీరెలు సునా యాసంగా చెల్లుబడౌతాయి. నూరూ నూటయాభైకి తక్కువలేకుండా ఈ పద్ధున గిట్టుబాటవుతూ వుంటుంది.

ఆదివారం అందరికీ ఆటవిడుపు.

శంకరం - ఇంచక్కా ఉదయం తొమ్మిది నుంచీ సాయంత్రం ఆరింటిదాకా - కుటుంబ సభ్యులతో ఇష్టాగోష్టి జరుపుతాడు. ఆరింటికి, వెళ్తే ఏ సినిమాకో షికారుకో వెళ్తాడు సతీసమేతంగా.

శంకరం యింట్లో కార్యకలాపాలు జలవిద్యుత్తులా సాగి పోతూవుంటై.

ఆ యిల్లు - యిప్పుడు - డెమన్స్ వర్క్‌షాప్ !

* * *

అక్క రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకున్నాడు శంకరం. "మీ బావకి ఏపనీ లేదు. సినిమా టిక్కెట్లు బ్లాక్ మార్కెట్ చేస్తున్నాడని నిన్న సాయంత్రం రామూని పోలీసులు పట్టుకెళ్లారు. ఇల్లు గడవడం చాలా కష్టంగా వుంది. చిన్నపిల్లలు నలుగురూ పస్తులతో కళ్లల్లో ప్రాణాలెట్టుకుని వున్నారు. కనీసం ఓ వంద రూపాయలు సర్దు ఈ నెల్లో."

'ఏ నెల్లో అక్కర్లేదు దానికి; నిత్య దరిద్రపు సంసారం' అంటారు శంకరం తల్లీ తండ్రీ.

ఉదయం పేపర్ యిచ్చి వస్తుంటే గోపీనాథ్ అంటున్నాడు, "ఎమ్మే ప్యాసై మూడేళ్ళయింది - లైఫ్‌లో సెటిల్ కాలేక పోతున్నాన్రా శంకరం. నీపనే బాగుంది."

తమ యాంత్రికమైన జీవితంలో ఊడిపోతున్న నట్టు ఏదో గోపీనాథ్‌కీ, శంకరం అక్కకీ తెలుసో తెలీదో గానీ — శంకరంకి మాత్రం తెలుసు.

అతనా వాస్తవం వాళ్లకి చెప్పాడో ఆక్షణంనుంచీ అతను వాళ్లకి శత్రువుగా మిగులుతాడు !!

ఆ నట్టుని మనం కిందకి రాలనీయవద్దు !!!